నెరవేరనున్న పేదల కల

- ప్రారంభదశలో ఇందిరమ్మ ఇళ్లు
- ఆనందంలో లబ్ధిదారులు


పూరేడుపల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు

మంగపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలనెరవేరుతోండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అటవీ మారుమూల గ్రామమైన పూరేడుపల్లి గ్రామ పంచాయతీని ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పైలట్ గ్రామంగా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా 63 మంది అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అందచేశారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు సింగిల్ బెడ్‌రూం, కిచెన్, హాల్ నిర్మించుకోనున్నారు. ఇందుకుగాను ఇంటి బేస్‌మెట్ లెవల్ పూర్తయిన వెంటనే రూ.లక్ష, రూఫ్ లెవల్ స్థాయిలో మరో రూ.లక్ష, స్లాబ్ లెవల్ పూర్తయిన తర్వాత రూ.2 లక్షలు, ప్లాస్టింగ్ కలరింగ్ పూర్తయిన తర్వాత మరో రూ.లక్ష చెల్లిస్తామని సంబంధిత అధికారులు లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి వెల్లడించారు. దీంతో పేదలు సంబురంగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. మంత్రి సీతక్క, సంబంధిత అధికారులు చొరవచూపి బిల్లులు సకాలంలో చెల్లించి ఇంటి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పనులు ప్రారంభం..

అధికారుల సూచనల మేరకు ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం పనులను ప్రారంభించారు. గ్రామంలో 63 మందికి ఇళ్లు మంజూరు కాగా.. ప్రస్తుతం 40 మంది ఇంటి నిర్మాణం పనులు పునాది దశలో ఉన్నాయి. 5 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తయ్యాయి. పనులు జరుగుతున్నప్పటికీ పనులపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంపై లబ్ధిదారుల్లో అసంతృప్తి నెలకొంది.

సీతక్కకు రుణపడి ఉంటాం



ఇందిరమ్మ పథకం పైలెట్ ప్రాజెక్టుగా పూరేడుపల్లిని ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి సీతక్క చొరవతో కలలో ఊహించని విధంగా ఇళ్లు మంజూరు చేశారు. సొంతింటి కలను నెరవేర్చిన మంత్రి సీతక్కకు రుణపడి ఉంటాం.

– పూనెం నగేష్, పూరేడుపల్లి

సంతోషంగా ఉంది



ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం , పనులను చేపట్టడం సంతోషంగా ఉంది. నిన్నటి వరకు పూరిగుడిసెల్లో జీవనం సాగించడం ఇబ్బందికరంగా ఉండేది. వర్షం వస్తే ఇల్లంతా కురిసేది. గత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం మాకు ఇళ్లు మంజూరు చేసి, సొంతింటి కలను నెరవేర్చిన సీతక్క మేలు మరువం.

– బషీరా బేగం, పూరేడుపల్లి

నిబంధనల ప్రకారమే..

ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇళ్ల నిర్మాణంపై ఇద్దరు మేస్త్రీలకు ట్రైనింగ్ ఇచ్చాం. నిర్మాణంలో ఎక్కడ కాంప్రమేజింగ్ ఉండదు. మధ్యవర్తుల ప్రమే యం ఉండదు. ప్రతి లబ్ధిదారులకు రూ.5 లక్షల వరకు విడతవారీగా చెల్లిస్తాం.

– సూర్యనారాయణ, పీడీ హౌజింగ్, ములుగు

పోశాలు మరణం ప్రజా ఉద్యమాలకు లోటు

- సూడి కృష్ణారెడ్డి


సంతాప సభలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

గోవిందరావుపేట: పార్టీ సీనియర్ నాయకుడు అంబాల పోశాలు మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పస్రా గ్రామంలో గురువారం అంబాల పోశాలు సంతాప సభ పొడిశ్ల చిట్టిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణారెడ్డి హాజరై.. పోశాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీపీఎంలో అంబాల పోశాలు కృషి ఎనలేనిదని కొనియాడారు. 1969 నుంచి నేటి వరకు ప్రజా సమస్యలే ధ్యేయంగా పోరాటాలు నిర్వహించాడని తెలిపారు. ప్రజల కోసం, కష్ట జీవుల హక్కుల కోసం నిరంతరం పరితపించిన నాయకుడు పోశాలు అని కొనియాడారు. మంచి నాయకుడిని పార్టీ కోల్పోవడం బాధాకరమని అన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి కార్యకర్త పని చేయాలని ఇదే ఆయనకు ఇచ్చే నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీరెడ్డి సాంబశివ, తుమ్మల వెంకట్ రెడ్డి, ఎండీ దావుద్, రత్నం రాజేందర్, తీగల ఆదిరెడ్డి, గొంది రాజేష్, సోమా మల్లారెడ్డి, కడారి నాగరాజు, ఉపేంద్ర చారి, కృష్ణారావు, రామస్వామి, కోటేశ్వరరావు, లెనిన్, సదానందం, ఐలయ్య, సారయ్య, సూర్యనారాయణ, నగేష్, మహేందర్, పురుషోత్తం, రమేష్, రాజు, బ్రహ్మాచారి, శ్రీను, రాజేశ్వరీ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

చిరుతపల్లిలో పశు వైద్యశిబిరం


మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బర్లగూడెం పంచాయతీ చిరుతపల్లి గ్రామంలో గురువారం పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలుబాక పశువైద్యాధికారి హరీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. దూడలలో నట్టల నివారణ, చర్మ వ్యాధి నివారణ మందులు, శ్వాస సమస్యకు మందులు అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది అరుణ, రామారావు తదితరులు ఉన్నారు.

ఐకమత్యానికి ప్రతీక రంజాన్


భూపాలపల్లి రూరల్: ముస్లింలకు పండుగ సామగ్రి అందజేస్తున్న సతీశ్


కాటారం: ఇఫ్తార్ విందులో ముస్లింలు, శశికాంత్

భూపాలపల్లి రూరల్: రంజాన్ పండుగ ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తుందని సీపీఐ 25వ వార్డు ఇన్‌చార్జ్ క్యాతరాజు సతీశ్ అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని కారల్‌మార్క్స్ కాలనీలో 20మంది ముస్లిం కుటుంబాలకు సతీశ్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా (పండుగ సామగ్రి) అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సహాయ కార్యదర్శి యాకుబ్ పాషా, సాబీర్ భాషా, కసరబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కాటారం: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని విలాసాగర్‌లో గ్రామ యూత్ అధ్యక్షుడు పూసాల శశికాంత్ ఆధ్వర్యంలో గ్రామంలోని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక మసీద్‌లో ముస్లింలతో కలిసి శశికాంత్, కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అట్టెం సత్తయ్య, పప్పుల రాజయ్య, చిగురు రాజు, ముచ్చుకుట్ల స్వామి, రాజసాగర్, మల్లయ్య, ముస్లిం మత పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో రంజాన్ వేడుకలు

మల్హర్: మండలంలోని కొయ్యూరు గ్రామంలోని విశ్వదీప్తి పాఠశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో గురువారం ముందస్తు రంజాన్ పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సందర్శన్ విద్యార్థులకు రంజాన్ పండుగ గురించి అవగాహన కల్పించారు.

కార్పొరేట్ సెలూన్‌ను రద్దు చేయాలి

- నాయీ బ్రాహ్మణ పట్టణ కమిటీ అధ్యక్షుడు రమేశ్


దీక్షలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: మంజూరు నగర్‌లో ఏర్పాటు చేయబోతున్న కార్పొరేట్ సెలూన్‌ను రద్దు చేయాలని జిల్లా కేంద్రంలో నాయీ బ్రాహ్మణ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ.. కార్పొరేట్ సెలూన్‌కు వ్యతిరేకంగా ఆరు రోజుల నుంచి నిరసనలు, బంద్‌కు పిలుపునిచ్చి శాంతియుతంగా కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో దీక్ష చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో 200 పేద నాయీ బ్రాహ్మణ కుటుంబాలు కులవృత్తి చేసుకుంటూ జీవన ఉపాధి కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ సెలూన్ వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. దీక్షలకు మద్దతుగా ధర్మ సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీందర్, తీన్మార్ మల్లన్న టీం అధ్యక్షుడు కైటం రవిపటేల్, బీసీ సంఘం నాయకులు భీమనాథుని సత్యనారాయణ, రమేశ్, రజక సంఘం నాయకులు శోభన్ బాబు, ముంజంపల్లి మురళీధర్, బీజేపీ టౌన్ అధ్యక్షుడు గీస సంపత్, మాజీ వైస్ చైర్మన్ హరీష్ రెడ్డి, నాయీ బ్రహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయగిరి సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మక్క, సారలమ్మ జాతర

- రెండో రోజు తరలివచ్చిన భక్తులు

కాటారం: మండలంలోని జాదారావుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రఘుపల్లి శివారు మైలమ్మ చెలుకలోని సమ్మక్క –సారలమ్మల మినీ మేడారం జాతర గురువారం రెండోరోజు కొనసాగింది. బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ పూజారులు పోచయ్య, లచ్చయ్య అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజులో భాగంగా సమ్మక్క తల్లి గద్దెపై కొలువుదీరగా అమ్మవార్లకు భక్తులు మొక్కులు సమర్పించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నాడు. బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్ కుమార్, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు దుర్గం తిరుపతి, నాయకులు గంట అంకయ్య, లింగయ్య, నేతకాని సంఘం యూత్ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జె రాజ్‌కుమార్, గోమాసే విక్రమ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు పావలా వడ్డీ జమ


చింతూరులో సమావేశమైన మహిళలు

వాజేడు: ప్రభుత్వం ద్వారా వచ్చిన పావలా వడ్డీ నగదును మహిళా సంఘాల్లో జమ చేసినట్లు ఏపీఎం లక్ష్మీదుర్గ గురువారం తెలిపారు. వాజేడు మండలంలోని 335 గ్రూపులకు రూ.32,39,251 వచ్చినట్లు వెల్లడించారు. డ్వాక్రా సంఘాల వారు సకాలంలో తాము తీసుకున్న రుణాలను చెల్లించడంతోవారికి ఈ పావలా వడ్డీ నిధులు వచ్చాయని తెలిపారు. నిధులను సదరు గ్రూపు సభ్యుల ఎస్‌బీ ఖాతాల్లో జమ చేయించినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో ఇప్పటికే మహిళా సంఘాల సభ్యులకు వివరిస్తున్నామని త్వరలోనే మండల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి ఈ వివరాలను తెలియజేయనున్నట్లు ఏపీఎం తెలిపారు.

రామాలయానికి విద్యుత్ దీపాలంకరణ


విద్యుత్ స్తంభాలకు ఎల్‌ఈడీ లైట్ల అలంకరణ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆలయం మాడవీధుల్లో సెంట్రల్ లైటింగ్, విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఎల్‌ఈడీ లైట్లతో స్వామివారి నామాలును ప్రత్యేక స్తంభాలకు అలంకరించి సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో మాడవీధుల్లో, ఆలయానికి నూతన శోభ సంతరించుకుందని గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చుంచుపల్లిలో పెసా గ్రామసభ వాయిదా


సభకు హాజరైన ప్రజలు, అధికారులు

మంగపేట: మండలంలోని చుంచుపల్లిలో ఇసుక క్వారీ నిర్వాహణపై పంచాయతీ కార్యదర్శి మోడెం రాజేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన పెసా గ్రామసభ కోరం లేకపోవడంతో శనివారం నాటికి వాయిదా పడింది. చుంచుపల్లిలో చెంచులక్ష్మి, లక్ష్మీనర్సింహాస్వామి గిరిజన లేబర్ ఇసుక సొసైటీలు ఉండగా ఇసుక క్వారీ నిర్వాహణకు రిజిస్టర్ సొసైటీ ఎంపిక కోసం పెసా గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో 621 మంది గిరిజన ఓటర్లు ఉండగా సభ నిర్వాహణకు గిరిజన ఓటర్లు మూడో వంతు 209 మంది హాజరు కావాల్సి ఉంది. కానీ 63 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో గ్రామసభ శనివారం నాటికి వాయిదా వేస్తునట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన లేబర్ సొసైటీ సభ్యులు తమకు రావాల్సిన రూ.1.60 కోట్ల బకాయిలను చెల్లించాలని అప్పటి వరకు గ్రామసభలను నిర్వహించేది లేదంటూ అధికారులకు వినతి పత్రాన్ని అందచేశారు. గ్రామసభ సందర్భంగా గొడవలు, ఆందోళనలు జరుగకుండా ఎస్సై టీవీఆర్ సూరి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ ప్రభాకర్, ఎంపీడీఓ భద్రూనాయక్, మమత పాల్గొన్నారు.

మోకాళ్లపల్లిలో కుంజ రాము వర్ధంతి


నివాళులర్పిస్తున్న సూర్య, విమలక్క, క్రాంతి

గోవిందరావుపేట: ములుగు నియోజకవర్గంలోని కొత్తగూడ మండలం మోకాళ్లపల్లి గ్రామంలో గురువారం ఆదివాసీ విప్లవ నాయకుడు, రాష్ట్ర మంత్రి సీతక్క భర్త కుంజ రాము 20వ వర్ధంతిని నిర్వహించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, రాము కుమారుడు సూర్యతో కలిసి.. గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు చింత క్రాంతి మండల నాయకులు రాము చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో విప్లవ గాయకురాలు విమలక్క, గుండెబోయిన అనిల్ యాదవ్, గొంది కిరణ్, వాసం శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

దళారుల ఇష్టారాజ్యం!

చేతికందిన మొక్కజొన్న పంట

- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- మద్దతు ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్న రైతులు


తేమ తగ్గేందుకు ఆరబెట్టిన మొక్కజొన్నలు

రేగొండ: ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటను అమ్ముకునేందుకు రైతులు తిప్పలు పడుతున్నారు. రైతులకు మద్దతు ధర కల్పించాల్సిన ప్రభుత్వం పంట చేతికందే దశలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి. కానీ దిగుబడి సగానికిపైగా చేతికందినా.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించి వారు ఇష్టారాజ్యంగా తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తున్నారు.

5 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు

వానాకాలంలో అధిక వర్షాపాతం నమోదు కావడంతో పత్తి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో మండలంలో పత్తి స్థానంలో రైతులు మొక్కజొన్నను సాగు చేశారు. సుమారుగా 5 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. నవంబర్‌లోనే మొక్కజొన్న సాగు చేయడంతో ప్రస్తుతం సగానికిపైగా పంట రైతుల చేతికందింది. ప్రతీ ఏటా మొక్కజొన్న పంట చేతికందే సమయంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంటారు. కానీ ప్రస్తుతం ఈ విషయంలో జాప్యం జరుగుతుండడంతో దళారులు మాయాజాలం ప్రదర్శించి మార్కెట్‌లో మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో మార్క్‌ఫెడ్ నుంచి స్పష్టత లేకపోవడంతో మొక్కజొన్న ధర తగ్గుతూ వస్తుంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,225 ఉండగా వారం రోజుల క్రితం వరకు రూ.2,100కు కొనుగోలు చేసిన దళారులు క్రమంగా తగ్గిస్తూ ప్రస్తుతం రూ.2 వేలకే కొనుగోలు చేస్తున్నారు. ఇది కూడా మరింత తగ్గే అవకాశం ఉండటంతో, పెట్టుబడి వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు సుమారుగా 50 శాతం పంట చేతికందగా మిగతాది కంకులు విరవడం, ఆరబెట్టడం వంటి పనులు చేస్తున్నారు. కాగా, ఈ సంవత్సరం భూగర్భ జలాలు తగ్గడంతో చివరి దశలో నీరు సరిగా అందగా దిగుబడిపై కొంత ప్రభావం చూపిందని రైతులు వాపోతున్నారు. సాధారణంగా యాసంగిలో ఎకరానికి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, కాని ప్రస్తుతం 30 క్వింటాళ్లు దాటడం లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే దిగుబడి రాక నష్టపోయామని మద్దతు ధర లభించకుంటే మరింత నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ఎకరానికి 35 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉన్నప్పటికీ 25 క్వింటాళ్లే వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం లేకపోవడంతో వ్యాపారులు రూ.2వేలకే అడుగుతున్నారు. ఆలస్యం చేస్తే ధర మరింత తగ్గే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

– రఘుసాల తిరుపతి, రైతు

దళారులకు అమ్ముకున్నాం..



రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. గత్యంతరం లేక పంటను దళారులు అడిగిన ధరకే విక్రయిస్తున్నాం. కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే గిట్టుబాటు ధర అందేది. సమయానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారు.

– మానూరి అశోక్, రైతు

ఒకే దేశం.. ఒకే ఎన్నికతోనే అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

రేగొండ: ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తరుచూ ఎన్నికలు నిర్వహించడంతో ప్రజాధనం వృథాతో పాటు కోడ్ కారణంగా అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతున్నాయని అన్నారు. జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చదువు రాంచంద్రారెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాదరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిబంధనలకు విరుద్ధంగా చికిత్స చేయొద్దు



కన్నాయిగూడెం: నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎంపీలు చికిత్సలు నిర్వహిస్తే నోటీసులు జారీ చేస్తామని వైద్యాధికారి అభినవ్ అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం ఆర్‌ఎంపీ క్లీనిక్‌లపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని శ్రీనివాస క్లినిక్, దేవస్య క్లినిక్‌లను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూల్స్‌కు విరుద్ధంగా పేద ప్రజలను దోపిడీ చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. స్టెరాయిడ్స్, యాంటి బైయాటిక్స్ అధిక మోతాదులో వాడితే చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేడు సంత, బందెల దొడ్డి వేలం

వాజేడు: పేరూరు గ్రామ పంచాయతీలో 2025–2026 సంవత్సరానికి సంత, బందెల దొడ్డి వేలం పాటను నేడు నిర్వహించనున్నట్లు ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం శుక్రవారం ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఈ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు పంచాయతీ కార్యదర్శికి ముందుగా తమ వివరాలను ఇవ్వాలని సూచించారు. పాట అనంతరం అందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు వెల్లడించారు.

ఉత్తమ ఎస్సైగా కమలాకర్



గోవిందరావుపేట: పస్రా ఎస్సై కమలాకర్ ఉత్తమ ఎస్సైగా ఎంపికై ఎస్పీ శబరీశ్ చేతుల మీదుగా గురువారం ప్రశంస పత్రంతోపాటు నగదు రివార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ.. ఉత్తమ ఎస్సైగా ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. నేర పరిశోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులు, నేరాలను చాకచక్యంగా పరిష్కరించిన పోలీసులను గుర్తించి రివార్డు అందజేస్తారని తెలిపారు. ఇదిలా ఉండగా.. ఎస్సై కమలాకర్‌ను డీఎస్పీ రవీందర్, సీఐ రవీందర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందించారు.

దరఖాస్తు చేసుకోండి..

ఏటూరునాగారం: రాజీవ్ యువ వికాసం పథకానికి యువత దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జగదీష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం ఉండాలని, రేషన్ కార్డు ఉన్నవారికి ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం లేదని తెలిపారు. రేషన్ కార్డు లేని వారు మాత్రమే ఆదాయ ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని, నివాస ధ్రువీకరణ పత్రం అవసరం లేదని పేర్కొన్నారు. పథకానికి దరఖాస్తు చేసుకునే వారు అవసరం లేని సర్టిఫికెట్ల కోసం మీ సేవ కేంద్రాల చుట్టూ తిరిగి సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని తహసీల్దార్ సూచించారు. పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను మండల ప్రజా పాలన సేవా కేంద్రాల్లో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట గ్రామానికి చెందిన దేవరనేని స్వామిరావు ఇంటిపై దాడి చేసి కారు అద్దాలు ధ్వంసం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. కాశిందేవిపేటకు చెందిన ఉప్పు అజయ్, పట్టెం రాజు, ఎన్నిండ్ల ప్రవీణ్, మస్క రాజు మంగళవారం రాత్రి సమయంలో దాడికి పాల్పడగా స్వామిరావు ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

చిట్యాల: మండలంలోని నవాబుపేటలో పురాతన శివాలయం శిథిలావస్థలో ఉండడంతో గ్రామస్తులు అంతా కలిసి చందాలు వేసుకుని ఆలయాన్ని నూతనంగా నిర్మాణం చేపడుతున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన కాల్వ సుగుణమ్మ కుమారులు కాల్వ రమేశ్‌రెడ్డి, సురేశ్‌రెడ్డిలు గురువారం రూ.1,00116 అందజేశారు. దాతలు ఆలయ అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి కోరారు. ఉపాధ్యక్షుడు మోతుకూరి నరేష్, ప్రధాన కార్యదర్శి సర్వ శరత్, కోశాధికారి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కాటారం: మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన జాడి లక్ష్మణ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురవడంతో కాలు విరిగింది. దీంతో మండలానికి సామాజిక సేవ యూత్ సభ్యులు రూ.10 వేలను గురువారం ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.